క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాచేపల్లి : మాదినపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ దండే నాగేశ్వరరావు గురువారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటుగా విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ రెండు రోజుల పాటు వ్యవసాయ బోర్లకు అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన చెప్పారు.

రోగులకు అన్నదానం



మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో వేంచేసియున్న శ్రీ సత్యసాయి దేవాలయ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు గురువారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బంది 300 మందికి, అదే విధంగా శ్రీ సత్యసాయి దేవాలయ ప్రాంగణంలో వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి విద్యాలయ, దేవాలయ నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి రోగిని పలకరించి అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కారెంపూడి: ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొనడంతో ఆటో పూర్తిగా ధ్వంసం అయిన ఘటన మండలంలోని నరమాలపాడు గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కారెంపూడి గ్రామానికి చెందిన వేల్పుల ఆంజనేయులు పండ్లు అమ్ముకునేందుకు తన సొంత ఆటోలో నరమాలపాడు గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా చిలకలూరిపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో నడుపుతున్న ఆంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలుస్తోంది. ఉదయం మంచు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నారు. తన జీవనాధారమైన ఆటో పనికి రాకుండా పోయిందని న్యాయం చేయాలని బాధితుడు కారెంపూడి ఎస్ఐ ఎం.రామాంజనేయులును ఆశ్రయించాడు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రజలకు మంచినీటిని అందజేయటమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల: ప్రజలకు మంచినీటిని అందజేయటమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. మాచవరం మండలంలోని గోవిందాపురం పంపింగ్ హౌస్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సకాలంలో వర్షాలు లేని కారణంగా సాగర్ నుంచి నీరు రాలేని పరిస్థితిలో పులిచింతల ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీలు ఉన్నాయని పరిశీలించటం జరిగిందన్నారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన మున్సిపల్ అధికారులతో చర్చించారు. అదే విధంగా పంప్ హౌస్ నుంచి నీటి సరఫరా ఎలా చేయాలని, వాటికి వచ్చే సమస్యలను ఎలా అధిగమించాలనేది అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, మున్సిపల్ ఏఈ తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని, ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ బుక్ చేసుకొని పత్తి కొనుగోలు కేంద్రం వద్ద పత్తిని అమ్ముకోవాలని సూచించారు. పత్తి రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, మార్కెట్ యార్డు సెక్రటరీ ఈశ్వరయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి మళ్లీ జగన్ సీఎం కావాలి



శ్రీరాంపురం తండా సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

వెల్దుర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు జగన్ మళ్లీ ఆంధ్ర రాష్ట్రానికి సీఎం కావాలని మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాంపురం తండా సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లలో అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. శ్రీరాంపురం తండా సచివాలయ పరిధిలో రూ.22.19 కోట్లు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అందించటం జరిగిందన్నారు. 33 పథకాల ద్వారా ఈ నిధులను అందజేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌కి మనందరం మద్దతుగా నిలవాల్సిన అవసరముందన్నారు. గతంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించటం జరిగిందన్నారు. నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని గుర్తుంచుకొని మరలా జగన్‌ను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, యార్డు మాజీ చైర్మన్ గురుబ్రహ్మం, మండల పార్టీ అధ్యక్షులు కె.పాపిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి మేకల కోటిరెడ్డి, సర్పంచ్ డి.యేగయ్య, ఎంపీటీసీ గార్లపాటి మంగమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు,వైఎస్సార్ సీపీ నాయకులు గాలయ్య, మార్కొండయ్య, బ్రహ్మం,ఆదినారాయణ, హనుమానాయక్,వెంకట్రామయ్య, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

ఏపీ ఉజ్వల భవిష్యత్‌కు మళ్లీ జగనే సీఎం కావాలి

దాచేపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉజ్వల భవిష్యత్‌కి మళ్లీ జగనే సీఎం కావాలని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. మండలంలోని పెదగార్లపాడులో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఏపీ సమగ్ర అభివృద్ధికి సీఎం జగన్ చేసిన కృషిని నేతలు ప్రజలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సీఎంగా మళ్లీ జగనే ఎందుకు రావాలనే దానిపై స్పష్టత ఇచ్చారు. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఏపీ సమగ్ర, సంక్షేమ అభివృద్ధికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య, మాజీ సర్పంచ్ కటికల వరలక్ష్మి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి ముత్యం చెన్నారెడ్డి, నాయకులు బైరపాగు కోటేశ్వరరావు, షేక్ సైదా, మద్దు ఏసయ్య పాల్గొన్నారు.

రూ.21.22 కోట్లతో గంగిరెడ్డిపాలెంలో అభివృద్ధి

మాచవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం సచివాలయంలో ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో గ్రామంలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ పట్టికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్ మాట్లాడుతూ జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో గ్రామానికి ప్రత్యక్ష నగదు బదిలీల ద్వారా రూ.15,39,35,568, పరోక్ష నగదు బదిలీ ద్వారా రూ.4,03,62,380, సచివాలయ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,79,77,000, మొత్తం కలిపి రూ.21,22,74,948 ఖర్చు చేసినట్లు వివరించారు. గ్రామంలో సుమారు 7,229 మందికి లబ్ధి చేకూరిందని తెలియజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అందుకే మరలా ఏపీకి జగనే సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. సర్పంచ్ ముండ్లపాటి పుల్లమ్మ కుమారుడు ఆంజినేయులు, వైస్ సర్పంచ్ చిన ఆంజినేయులు, జెడ్పీటీసీ శివాయాదవ్, వైస్ ఎంపీపీ నన్నే షైదా, ఎంపీటీసీలు సత్యన్నారాయణ, గురవయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.రాము, కన్వీనర్లు ఆదాం, అబ్దుల్, సాంబశివరావు, వెంకటేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెదగార్లపాడులో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తున్న నేతలు

ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు

గురజాల : ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-1లో జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా గురువారం సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఒక వైపు సంక్షేమం మరొక వైపు అభివృద్ధి సమానంగా ప్రజలకు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలన్నారు. వైస్ చైర్‌పర్సన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, కౌన్సిలర్ కుక్కమూడి అనిల్‌కుమార్, బండి రవికుమార్, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాగులుమీరా, నాగులు, వలి తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి..

రెంటచింతల: రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ అవసరం ఎందుకు అనే కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వలంటీర్లకు ప్రచార కిట్లను పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పార్టీ నేతలతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలన్నారు. ముందుగా గ్రామంలోని ఆలయాల సెంటర్లో వైఎస్సార్ సీపీ జండాను ఎగురవేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పూజల రామయ్య, పార్టీ నేతలు పేర్ల ముత్తయ్య, గొట్టం భాస్కర్‌రెడ్డి, ఓర్సు కాశయ్య, దోర్నాల బంగారురెడ్డి, వట్టి వెంకటేశ్వరరెడ్డి, చింతా శివారెడ్డి, మాచవరపు మరియదాసు, తురకా శ్రీను, జినుగు గురువులు, మంచి లక్ష్మయ్య పాల్గొన్నారు.



మిట్టగుడిపాడులో కిట్‌లను పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరి



పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

వై ఏపీ నీడ్స్ జగన్ ప్లకార్డులు ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని 13వ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ ప్లకార్డులను గురువారం మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే పేదలకు న్యాయం, సంక్షేమ పథకాలు అమలు చేయటం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ ప్లకార్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ఏ సచివాలయంలో ఎంత లబ్ధిపొందారనేది ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, రాష్ట్ర బీసీ నాయకులు కుందుర్తి గురవాచారి, కౌన్సిలర్ అన్నెం పద్మావతి బంగారురెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి జూలకంటి శ్రీనివాసరావు, సచివాలయ అడ్మిన్ నాగార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి గడపను ఆదుకున్నాడు అందుకే జగనన్నే మళ్లీ కావాలి

కారెంపూడి: ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మండల జేసీఎస్ కన్వీనర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బోర్డును స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ జవ్వాజి నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదా, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి, గాడిపర్తి రమాదేవి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, మాచర్ల ఏడుకొండలు, మామిడి శేఖర్, అన్నారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన అందించిన జగనే మళ్లీ సీఎం కావాలి

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటే పేదవారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మండల పార్టీ నాయకులు బూడిద శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని గన్నవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీల్లో 90 శాతంపైగా అమలు చేశారని అన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అని రైతులకు రుణమాఫీ చేయకుకండా మోసం చేస్తే అదే జగనన్న వ్యవసాయ రంగానికి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. వ్యవసాయ వృద్ధి రేటులో దేశంలోనే 6వ స్థానంలో నిలిచిందన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించారన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్, ఉచిత మెడిసిన్, ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసి, విద్యా, వైద్యానికి అగ్రస్థానం కల్పించారన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లుస్వామి, జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, పోతురెడ్డి కోటిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కందుల శివారెడ్డి, ఎంపీటీసీ దొండేటి సాంబశివారెడ్డి, పార్టీ నాయకులు ఆరికట్ల చంద్రారెడ్డి, పిన్నెల్లి రామ్మోహనరెడ్డి, తాతిరెడ్డి బ్రహ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆంజనేయరెడ్డి, గొర్రెల పెంపకం దార్ల జిల్లా యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, ఎంపీడీఓ సరోజనీదేవి, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.



గన్నవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మండల పార్టీ నాయకులు

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిల



మాట్లాడతున్న జూనియర్ సివిల్ జడ్జి

గురజాల : ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం కలిగి వుండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిల విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకుని పదో అదనపు జిల్లా జడ్జి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ జానీబాషా, కలివెల ప్రభుదాసు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి మురళి

మాచవరం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ పడడమే ఉత్తమ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించబడతాయని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి మురళి గంగాధర్‌రావు అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ సేవా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లో వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉన్న వారికి ఉచితంగా లాయర్లను ఏర్పాటు చేయనున్నటు చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరంగా పరిష్కరిస్తామని, సమయం ఆదా అవుతుందని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో కక్షలు విడనాడి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని చిన్నారులను చదివించాలని, విద్య ద్వారానే సమాజంలో మార్పు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో లాయర్ చంద్రకళ, హెడ్‌కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

రైలులో నుంచి జారిపడి వ్యక్తి మృతి

దాచేపల్లి : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. నడికుడి-పొందుగల రైల్వే స్టేషన్ల మధ్యలో సుమారు 35 సంవత్సరాల వయస్సున్న ప్రయాణికుడు రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో శరీర భాగాలు విడిపోయాయి. రైల్వే సిబ్బంది ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వివరాల కోసం 9440309859 నెంబర్‌ని సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సునీల్ తెలిపారు.

ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్ తదితరులు

వెల్దుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఇంటి నెంబర్ జీరో ఉంటే వాటిని సవరించాలన్నారు. మృతి చెందిన వారుంటే ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒకే ఇంటి నెంబర్‌పై 10 ఓట్ల కన్నా ఎక్కువ ఉంటే ఆ ఓటర్ల జాబితాను సమగ్రంగా విచారించి తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సక్రమంగా నిర్వహించాలన్నారు. ఫారం 8 ద్వారా తప్పులను సరిచేయాలన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్రంగా విచారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ నాయక్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కారెంపూడి విద్యార్థులు



ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కారెంపూడి : రాష్ట్రస్థాయిలో జరుగు ఖోఖో పోటీలకు కారంపూడి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత శివ తెలిపారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. అండర్ 14 విభాగంలో రైనపాల్, అశ్వనీలు, అండర్ 17 విభాగానికి నాగవర్ధన్, కామాక్షి, అనూషలు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగం చిత్తూరు జిల్లా బంగారుపల్లిలో, అండర్ 17 విభాగం కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని వాటిలో కారెంపూడి విద్యార్థులు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, స్వర్ణరాజు తదితరులున్నారు.

తాళ్ళపల్లిలో మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు

మాచర్ల రూరల్: మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో క్రీస్తు లూథరన్ దేవాలయం ఆలయ ప్రతిష్ట వారి నేతృత్వంలో కృష్ణా, గుంటూరు, నల్గొండ జిల్లాల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు నందిగం దేవదాసు, కేతుపల్లి రాజేష్‌లు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి నేతృత్వంలో ఈ నెల 20,21,22 తేదీలలో ఎంపీపీ (ఎస్సీ) పాఠశాల ప్లేగ్రౌండ్‌లో మూడు జిల్లాల స్థాయిలో పోటీలను ప్రారంభిస్తున్నట్లు వారు చెప్పారు. మొదటి బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ.15,016, తృతీయ బహుమతి రూ.10,016, నాల్గవ బహుమతి రూ.5,016లు అందించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలచిన వాలీబాల్ ఆటగాళ్ళు ఈ నెల 17 లోపు నందిగం దేవదాసు 9912200134, కేతుపల్లి రాజేష్ 6302029443 నెంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

యువతకు కష్టపడే తత్వాన్ని నేర్పించాలి

కలెక్టర్ లోతేటి శివశంకర్



ప్రజాభిప్రాయ వేదికలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

రెంటచింతల: ప్రస్తుత సమాజంలో యువతకు కష్టపడే తత్వాన్ని తల్లిదండ్రులు నేర్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. గురువారం మండలంలోని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ వేదికలో కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఒక కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలంటే ఆషామాషీ కాదని..ముందు ఉపాధికోసం ఉద్యోగ అవకాశం కల్పించాలని అడిగి తరువాత మన కోర్కెలను కర్మాగారాలపై రుద్దడం సమంజసం కాదన్నారు. జెట్టిపాలెం, గోలి, మల్లవరవ గ్రామాలకు సంబంధించి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జలజీవన్ మిషన్ ద్వారా వచ్చే నిధులు రూ.1.20 కోట్లు, ఫ్యాక్టరీ వారి సహకారంతో ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో చర్చించి కృషి చేస్తానన్నారు. 2005లో రూ.383 కోట్లతో స్థాపించిన పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రస్తుతం రూ.90 కోట్లతో చేపడుతున్న విస్తరణ పనులకు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో 317.782 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న పరాశక్తి సున్నపురాయి గని పర్యావరణ అనుమతి (ఈసీ) పొందేందుకు మూడు గ్రామాల ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదన్నారు. కాలుష్య నివారణకు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను, సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పనులను చేపట్టడం జరిగిందని ఫ్యాక్టరీ చీఫ్ జనరల్ మేనేజర్ జి.ధర్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెట్టిపాలెం గ్రామస్తులు తాగు నీటి సమస్యను పరిష్కరించి గ్రామాభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా యాజమాన్యం కృషి చేయాలన్నారు. గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పశర్లపాడును కూడా ఫ్యాక్టరీ దత్తత గ్రామంగా తీసుకుని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సభ్యులు పలు సూచనలు, సలహాలను ఇచ్చి అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యావరణ పరిరక్షణ ఇంజనీర్ నారాయణరావు, గురజాల ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కె.పుల్లారావు, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, పొల్యూషన్ అధికార్లు, పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, ఫ్యాక్టరీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

22న మూడు గ్రామాల ప్రజలతో సమావేశం...కలెక్టర్ లోతేటి

ప్రజాభిప్రాయ వేదికలో పరాశక్తి ఫ్యాక్టరీ దత్తత గ్రామాలైన జెట్టిపాలెం, గోలి, మల్లవరం గ్రామస్తుల నుంచి వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 22న మరోసారి ఆయా గ్రామస్తులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీపీ, మండల స్థాయి వివిధ శాఖా అధికారులు పాల్గొని ఆ మూడు గ్రామాలకు తాగునీటి అవసరాలకు ఏఏ చర్యలు చేపట్టాలో, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.